క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



వేలేరు : ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీల్లో సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో విద్యార్థులు అన్వేష్, కౌశిక్, నీతు, గణేశ్, నవ్యశ్రీ, తులసి, రిషిత, సింధు ఎంపిక కాగా వారిని అభినందించి సర్టిఫికెట్లు అందించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ చిట్యాల స్వామి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అవార్డు అందుకున్న రాజేందర్



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి రాజేందర్‌కు న్యూ ఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ స్వేవారత్న జాతీయ అవార్డును ప్రదానం చేసింది. ఆదివారం రాత్రి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. కేటీపీపీలో ఆర్టిజన్ కార్మికుడిగా పనిచేస్తున్న రాజేందర్.. నిరుపేదలకు, తోటి కార్మికులకు చేసిన సహకారం, సేవను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ సంస్థ ఈ అవార్డును అందించినట్లు పేర్కొంది. మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు అశోక్, మాజీ ఎంపీటీసీ రజని సత్యనారాయణ, విక్టరీ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, సురేష్, భరత్, నాగరాజు, నరేష్, రాజాసాంబయ్య, సదయ్య పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు

ఐనవోలు : దళిత బంధు సాధన కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని పెరుమాండ్లగూడెం గ్రామానికి చెందిన దళిత నాయకుడు దుప్పెల్లి కొమురయ్యను సోమవారం ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో 11కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతు కారణంగా మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ సుధాకర్ తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, సహకరించాలని కోరారు.

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర, లష్కర్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఓసిటీ, గాంధీనగర్, క్రిస్టియన్ కాలనీ, ఎస్ఆర్.నగర్ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రైల్వే పెన్షనర్ల సమావేశం

కాజీపేట: కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కందుల సంఘమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న సమావేశంలో జోనల్ సెక్రటరీ డాక్టర్ పి.యుగంధర్‌తో పాటు రైల్వే ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశాన్ని అసోసియేషన్ సభ్యులు విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఓరియెంటేషన్ ప్రోగ్రాం

వరంగల్: వడుప్సా ఆధ్వర్యంలో వరంగల్ డివిజన్ పరిధిలో పదో తరగతి విద్యార్థులకు ఉర్సుగుట్ట సమీపంలోని నానీ గార్డెన్స్‌లో ఈనెల 18న ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓరియెంటేషన్ ప్రోగ్రాం (అవగాహన సదస్సు) నిర్వహించనున్నట్లు డివిజన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య, కార్యదర్శి విలియమ్స్ తెలిపారు. వరంగల్‌లోని స్పందన పబ్లిక్ స్కూల్‌లో వడుప్సా డివిజన్ కమిటీ కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది.

కాజీపేట జంక్షన్‌లో విద్యుత్ వారోత్సవాలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే కార్యాలయాల్లో విద్యుత్ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే కార్యాలయాలు, రైల్వే క్వార్టర్స్, వర్క్‌షాప్‌లలో విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

గజగజ వణికిస్తున్న చలి

- నాలుగు రోజుల నుంచి ప్రతాపం
- జోరుగా రగ్గులు, స్వెటర్ల కొనుగోళ్లు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



ఎల్కతుర్తిలో చలిమంటలు కాగుతున్న ప్రజలు



రగ్గులు కొనుగోలు చేస్తున్న మహిళ

ఎల్కతుర్తి : మూడురోజుల నుంచి గ్రామాల్లో చలి వణికిస్తోంది. ఉదయం 4గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 5 గంటలు సమీపిస్తుండడంతోనే చలి తీవ్రత పెరుగుతోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు చలికి బయపడి ప్రయాణాన్ని కొనసాగించలేకపోతున్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వలన రెండు, మూడు రోజుల నుంచి చలి విజృంభిస్తుంది. దీంతో మూలకు పడేసిన స్వెటర్లు, రగ్గుల కోసం ప్రజలు వేతకడం, కొత్తవి కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. చలికి శరీరం పగుళ్లుబారిన పడకుండా ఉండేందుకు వ్యాజిలేన్, ఇతర క్రీమ్‌లు వినియోగిస్తూ జాగ్రత్త పడుతున్నారు. గ్రామాల్లో చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. అయితే చలికాలం అక్టోబర్ మొదటివారం నుంచే చలి ప్రారంభం కావాల్సి ఉండగా వర్షాల ప్రభావంతో కొంత ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. అయితే రెండు, మూడు రోజుల నుంచి ప్రారంభమైన చలి.. గజగజ వణికిస్తోంది. చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు చలినుంచి రక్షణ పొందేందుకు వివిధ రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కూలీలకు తప్పని తిప్పలు

పత్తి తీసేందుకు వెళ్తున్న కూలీలకు చలి తీవ్రత పెద్ద సమస్యగా మారుతోంది. సాయంత్రం ఐదు కాగానే చలి విజృంభిస్తుండడంతో కూలీలు తలకు టవాళ్లు చుట్టుకుని ఇంటిదారి పడుతున్నారు.

జంకుతున్న వాహనదారులు

చలి తీవ్రతకు ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. దూర ప్రయాణాలు చేయాలంటే ఉదయమే పూర్తి చేసుకునేలా ప్లాన్ చేసుకుంటున్నారు.

వెచ్చని దుస్తులు ధరించాలి



నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇళ్లలో నుంచి బయటకు రాకుండా ఉంటే మంచిది. వెచ్చని దుస్తులు ధరించాలి. చల్లారిన పదార్థాలు కాకుండా వేడి పదార్థాలు తీసుకోవాలి. బయటకు వెళ్లే ముందు వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు తలకు పాగా చుట్టుకుని వెళ్లాలి. చలి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో చిన్నారులకు రక్షణ చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ప్రతీప్‌రెడ్డి, ముల్కనూరు, పీహెచ్‌సీ

సఖి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

- లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత

ఐనవోలు : సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో వీఓ సభ్యుల సమక్షంలో సఖి–వన్ స్టాప్ సెంటర్ సేవలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ కొనసాగుతుందన్నారు. మహిళలు చట్టాలను ఎలా వినియోగించుకోవాలనే అంశాలను వివరించారు. విడిపోయే భార్యాభర్తలకు సఖి సెంటర్ కౌన్సెలింగ్ ఇస్తుందన్నారు. వరకట్న, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి తదితర వేధింపులకు సంబంధించిన సమస్యలను సఖి సెంటర్ పరిష్కరిస్తుందన్నారు. బాధిత మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తుందన్నారు. బాధిత మహిళలు, బాలికలు 0870–2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు.

కట్టుకట్టి.. ప్రాణం పోసి



మానవ మనుగడ, సర్వజీవుల జీవనానికి వృక్ష సంపద దోహదపడుతుందని పర్యావరణ ప్రేమికులు అనే మాటలు ఆ యువకులను కదిలించాయి. పట్టణంలోని నగర వీధిలో రెండేళ్ల క్రితం నాటిన అల్లనేరడి మొక్క కాండాన్ని మూగజీవాలు విరిచాయి. గమనించిన స్థానిక యువకులు చెట్టుకు కట్టు కట్టి మళ్లీ ప్రాణం పోశారు. పచ్చని ఆకులతో గాలికి కదుతూ ఉన్న చెట్టును చూసి యువకులు, కాలనీవాసులు ఆనందపడ్డారు.

– పరకాల

పేదల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- 1వ వార్డు కౌన్సిలర్ సంపత్‌కుమార్



సర్వేను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ సంపత్‌కుమార్

పరకాల : పేదలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ అన్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో మూడురోజులుగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇంటిపన్ను, నల్లా పన్ను, కరెంట్‌బిల్లు, ఇంటి స్థలానికి సంబంధించిన వివరాలు తెలుపాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులతో పాటు ఉద్యోగులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నడికూడ : ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక సర్వే మండలంలోని కౌకొండ గ్రామంలో సోమవారం ప్రారంభమైంది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇళ్లకు వెళ్లి యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. కార్యదర్శి విద్యాసాగర్, కుమారస్వామి, సదానందం, కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ గౌరవ వేతనం, కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాగుల రమేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నడిగొండ రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి విద్యార్థులకు వంట చేసి పెడుతుండడం కార్మికుల అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.సమ్మక్క, సరిత, జి.శాంత, పర్వీన్, కవిత, ప్రేమలత, సంధ్య, లక్ష్మి, జి.సక్కుబాయి, రాధ, శ్రీలత, కొమురమ్మ, రేణుక, మంజుల, కవిత, కార్మికులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్రం



వరంగల్ : ర్యాలీగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు



హనుమకొండ : కలెక్టరేట్‌కు వెళ్తున్న నాయకులు

- ఎంసీపీఐ (యూ)జిల్లా కార్యదర్శి రమేష్

వరంగల్: ప్రజలందరికీ చెందాల్సిన దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతూ, కష్టజీవుల హక్కులను కాలరాసే విధానాలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని ఎంసీపీఐ (యూ)జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండలోని ఏకశిల పార్కు నుంచి వరంగల్ కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ సంధ్యారాణికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ, ఎంసీపీఐ(యూ)నాయకులు జగదీశ్వర్, మసూక్, రవి, బాబురావు, ఇస్మాయిల్, నాగేష్, నర్సయ్య, రవి, రామచందర్, రాజు, గోవర్ధన రాజు, జమున, రాకేష్, మల్లయ్య, జయ, రజిత, అశోక్, సుధీర్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్: బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి.హంసరెడ్డి సూచించారు. భారత మార్కిస్ట్ కమ్యూనిస్టు పార్టీ (ఐక్య), అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం, రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హంసారెడ్డి, ఏఐసీటీయూ జిల్లా కన్వీనర్ మొగిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు నాగార్జున, రవీందర్, రాజిరెడ్డి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు భద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

కదనభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హసన్‌పర్తి: ఈనెల 22న వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కాకతీయ కదనభేరి వాల్‌పోస్టర్లను చింతగట్టు క్యాంపులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 1నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పింఛన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు లింగమూర్తి, చంద్రకాంత్, శేషగిరి, రాజమౌళి, అనంతుల శ్రీనివాస్, రమేష్, శంకర్, అక్బర్, హమీద్, సరిత, సదానందం, విజయ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, సాయంత్ర 7 గంటలకు స్వామివారికి సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గోవింద నామాలు, శ్రీకృష్ణ అష్టకం, మంత్రపుష్పం, మంగళ శాసనాలు, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరేష్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో లక్ష నామార్చనలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రఘు రామాచార్యుల ఆధ్వర్యంలో మహిళలతో లక్ష్మీ నారాయణుల లక్ష సహస్రమార్చనలు అర్చకులు చేయించారు. ఆలువేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు.

వీరభద్రుడి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు



కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ వేడుకలు మొదలయ్యాయి. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించినప్పుడు ధను సంక్రమణం అని శాస్త్రాలు చెబుతున్నాయని, నేటితో నెలరోజుల పాటు సంక్రాంతి జాతర నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా గణపతిపూజ నిర్వహించి స్వామివారి బ్రహ్మోత్సవం పత్రిక లిఖించి కార్య నిర్వహణాధికారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకుడు రాజయ్య, ముఖ్యఅర్చకుడు రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, రమేశ్, సందీప్, వినయ్‌శర్మ, వీరభద్రయ్య, శరత్‌చంద్ర, శివకుమార్, శ్రావణ్, రవీందర్, నారాయణరావు, శ్రీధర్, భిక్షపతి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధుల విడుదల హర్షణీయం

- కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1 కోటి 50 లక్షల నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, కృషి చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చిత్రపటాలకు కాంగ్రెస్ మండల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంగా ఏర్పడి 8 ఏళ్లు గడుస్తున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంప్లెక్స్‌ల నిర్మాణం ఊసే ఎత్తలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే మండల పరిషత్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని, త్వరలోనే టెండర్ ప్రకియ పూర్తిచేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరైనా కమిషన్‌లు అడిగితే వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని సూచించారు. మాజీ ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, మండల యూత్ అధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, గ్రామశాఖల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, రమేశ్, స్వామి, నాయకులు తిరుపతిరెడ్డి, సంపత్, శంకర్, సంపత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప నారికేళి పడిపూజ



పడిపూజలో పడి వెలిగిస్తున్న గురుస్వాములు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో గల పున్నం సాంబయ్య గురుస్వామి ఇంట్లో సోమవారం అయ్యప్ప నారికేళి మహా పడిపూజ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపంలో గణపతి–లక్ష్మీదేవి అయ్యప్ప పటాలను ఏర్పాటు చేసి అయ్యప్ప స్వామికి పంచామృతాలతో 18 కలశాలతో గురుస్వామి గోపాలకృష్ణ అభిషేకం చేశారు. అయ్యప్ప శరణుఘోషతో గ్రామమంతా మార్మోగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ గురుస్వామి సామల భిక్షపతి, జిన్నా శ్రీనివాస్ రెడ్డి, తోట రాజన్న, ఆకుల శివకుమార్, గట్టు కిషన్, మార్త సుమన్, బొల్లపెల్లి సదానందం, గోరంటల ప్రశాంత్, దండిగారి కిరణ్, దురిశెట్టి భిక్షపతి, శ్రీకాంత్, శ్రీధర్, వేణు, సాయి, వరుణ్‌తో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఏ'లకు టైమ్‌స్కేల్ అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఆత్మకూరు : ఎస్ఎస్ఏ (సర్వశిక్షఅభియాన్) ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మండలంలోని నీరుకుళ్లలో గల జెడ్పీహైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం లక్ష్మి, పీఎస్ హెచ్ఎం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు రమేశ్, సంజీవ, సుకన్య, శ్రీదేవి, కోటి, సీతారాం, కుమారస్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

'అన్‌మ్యాన్డ్'ల వేతనాలు ఖాతాల్లో జమచేయాలి

- సీఎండీని కలిసిన కార్మికులు



సీఎండీని కలిసిన అన్‌మ్యాన్డ్ కార్మికులు

ఆత్మకూరు : అన్‌మ్యాన్డ్ కార్మికుల వేతనాలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ, టీజీఈఈయూ కంపెనీ గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం టీజీ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ కార్మికులతో కలిసి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నూతనంగా పెరిగిన స్కిల్డ్ వేతనాలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలని, ఎలాంటి కట్టింగ్‌లు లేకుండా ఇవ్వాలని కోరారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎండీ వచ్చే నెల నుంచి అకౌంట్ ద్వారా నేరుగా వేతనాలు అందిస్తామని, అదే విధంగా ప్రమాద బీమా సౌకర్యం గురించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బూర వరుణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు సంతోష్, వెంకటేష్, సందీప్, నరేష్, రఫీ, రంజిత్, ఉమ్మడి ఐదు జిల్లాల అన్‌మ్యాన్డ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి

- జీఎంపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి లింగయ్య



మాట్లాడుతున్న లింగయ్య

ఐనవోలు : గొల్ల, కురుమల హక్కుల సాధనకై ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన చలో హైదరాబాద్ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల కమిటీ సమావేశం సోమవారం మండల కేంద్రంలో కావటి బద్వేలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్ల పంపిణీని నిలిపివేయడమే కాకుండా గొర్లకాపరుల సంక్షేమాన్ని మరిచిందన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతునన నేపథ్యంలో శాసన సభలో గొర్లకాపరుల సమస్యలు చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గొర్రెల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి నగదు బదిలీ అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చిన్నరాజు, యాకయ్య, దయాకర్, చేరాలు, వెంకటయ్య, భాస్కర్, బాబు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి



వరంగల్: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి శివారులోని 791, 782, 786, 355, 357, 298 సర్వే నంబర్లలోని ఎస్సారెస్పీకి చెందిన భూముల్లో మూడేళ్ల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం చేసి ఇల్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. ఈమేరకు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణికి సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాత్రి డ్రోజర్ల సహాయంతో కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు బాషమియా, యాదగిరి, రవీందర్, రవి, రమేష్, సుధీర్, మల్లన్న, శంకర్, హరిబాబు, రవి, మొగిలి పాల్గొన్నారు.